క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

పెద్దేముల్: ఈ నెల 31న పెద్దేముల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీఓ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న సమీక్షకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

కుళ్లిన బిర్యానీపై ఆరాతీస్తున్నాం..

వికారాబాద్ అర్బన్: పారిశుద్ధ్య కార్మికులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయొద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల అన్నారు. స్పెషల్ శానిటేషన్ ముగింపు రోజైన ఈ నెల 27న కార్మికులకు ఇచ్చిన బిర్యానీ కుళ్లి పోయిందని, ఈ విషయంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీగా చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లారు. ఈ విషయంపై ఆమె కార్మికులతో మాట్లాడుతూ కుళ్లిపోయిన బిర్యానీ విషయం తన దృష్టికి వచ్చిందని, బాధ్యులు ఎవరనే దానిపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న శేరినారాయణరెడ్డి

బొంరాస్‌పేట: అంధత్వ నివారణ కోసమే కంటివెలుగు కార్యక్రమం అని మండల మాజీ వైస్ఎంపీపీ శేరినారాయణరెడ్డి అన్నారు. చౌదర్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కంటి చూపు సమస్య ఉన్నవారు నేత్ర శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, నాయకులు తుల్జారెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బొడ్రాయి పండుగ

బొంరాస్‌పేట: నాందార్‌పూర్‌లో బొడ్రాయి పండుగ సోమవారం ప్రారంభమైంది. ఈనెల 31 వరకు జరిగే ఉత్సవాల్లో ఆయిదాలపల్లి అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, నవగ్రహాలపూజ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సోమవారం యాగశాల ప్రదక్షిణ, మండప దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ హోమాలు, సాయంత్రం ప్రదోష పూజ, మంత్రపుష్పము, అంకురార్పణ జలాధివాసము నిర్వహించారు. మంగళవారం ఊరేగింపు, బుధవారం విగ్రహపూజలు, తీర్థప్రసాదాలు, ముగింపు కార్యక్రమాలు చేశారు.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే




పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

నవాబుపేట: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరుతుందని ఆ పార్టీ నాయకుడు విజయకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటింటికీ బీజేపీ ప్రజాయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తిగిద్ద గ్రామంలో ఆయన పర్యటించి మాట్లాడారు. గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం నిధులతోనేనని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీమోర్చా ప్రధానకార్యదర్శి శ్రీధర్‌రావు, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కక్షిదారులకు సదావకాశం

అనంతగిరి: జూన్10న జరిగే మెగా లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ కొరకు వేచిచూస్తున్న కక్షిదారులు ఎవరైనా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో రాజీ కుదిరితే ఇద్దరూ గెలిచినట్లేనన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

కుల్కచర్ల: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యాదమ్మ అన్నారు. సోమవారం బండవెల్కిచర్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు. బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ సెంటర్లను వినియోగించుకోవాలని సూచించారు.

దశాబ్ది వేడుకలు వైభవంగా జరగాలి

- ప్రభుత్వ కార్యాలయాలను సుందరీకరించండి
- ఉత్సవాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి
- వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు



అనంతగిరి: మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ

తాండూరు రూరల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని, ఇందులో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని ఎంపీపీ అనితగౌడ్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జూన్ 2నుంచి మూడు వారాల పాటు జరిగే వేడుకలు ఘనంగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కోరారు. తహసీల్దార్ చిన్నప్పల నాయుడు మాట్లాడుతూ.. ఉత్సవాల నేపథ్యంలో ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

యాలాలలో..

యాలాల: ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని తహసీల్దార్ గోవిందమ్మ అన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో మండల ప్రత్యేక అధికారి రాంరెడ్డి, ఎంపీడీఓ పుష్పలీలతో కలిసి నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెప్పారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో ఉత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. శ్రీరాఘవేంద్ర ఫంక్షన్ హాలులో ఉదయం 10గంటలకు సమీక్ష ఉంటుందన్నారు.

ఉత్సవాలకు సిద్ధంకండి

బషీరాబాద్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు అధికారులు సిద్ధం కావాలని మండల ప్రత్యేక అధికారి సూచించారు. ఈ మేరకు బషీరాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు.

మర్పల్లిలో..

మర్పల్లి: రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ బట్టు లలిత, జెడ్పీటీసీ మధుకర్ అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

వైభవంగా నిర్వహించాలి

అనంతగిరి: దశాబ్ది ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి అన్నారు. ఈ మేరకు వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలపై ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉత్సవాలను పురస్కరించుకుని రోజువారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలను ఆమె వివరించారు.



తాండూరు రూరల్: సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనితగౌడ్

సమష్టిగా ఉత్సవాలు జరుపుదాం

పెద్దేముల్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు సమష్టిగా పనిచేద్దామని ఎంపీడీఓ లక్ష్మప్ప కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో రెవన్యూ, వైద్య, అటవీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో ఉత్సవాలపై నిర్వహించిన సమీక్షలో పలువురు అధికారులు మాట్లాడారు. ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని, వేడుకల ముగింపు వరకు సమష్టిగా పనిచేయాలన్నారు. తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు, ఎంపీఓ షేక్ సుష్మా, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాలు సరే.. డబ్బులు ఎవరిస్తారు?

బంట్వారం: దశాబ్ది ఉత్సవాలు సరే.. 20 రోజుల నిర్వహణ ఖర్చులకు డబ్బులు ఎవరిస్తారంటూ ఎంపీపీ ప్రభాకర్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావును ప్రశ్నించారు. ఉత్సవ సన్నాహాలపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ప్రత్యేక అధికారి వేడుకల గురించి వివరించగా.. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వానికి డబ్బా కొట్టమంటే ఎలాగని ప్రశ్నించారు.

అభివృద్ధికి నోచుకోని లింకురోడ్లు

గ్రామీణ రోడ్ల దుస్థితి పట్టని ప్రజాప్రతినిధులు: ప్రజలు

దౌల్తాబాద్: గ్రామాల మధ్య దూరభారం తగ్గించడానికి ఏర్పాటు చేసిన లింకు రోడ్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్ల పనులు పూర్తికాకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రహదారుల పనులు పూర్తయినప్పటికీ.. చేయాల్సినవి ఎక్కువగా ఉన్నాయి. వర్షాకాలం రాకముందే పనులు పూర్తిచేస్తే బాగుటుందని మండల ప్రజలు చెప్పారు. ఇదిలా ఉండగా గ్రామీణ లింకు రోడ్ల గురించి పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

లింక్ రోడ్లు ఇవి..

ఈర్లపల్లి-గోకఫసల్‌వాద్ గ్రామాల మధ్య దౌల్తాబాద్ మీదుగా సుమారు 13 కి.మీ. ఉంటుంది. పొలాల గుండా వేసిన రోడ్డు కేవలం 5 కి.మీ మాత్రమే. దీనిని తారుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఊరగుంట-ఇండాపూర్ మధ్య రోడ్డును తారుగా మారిస్తే 8 కి.మీ. దూరం తగ్గుతుంది. బిచ్చాల-అంతారం రోడ్డును మరమ్మతు చేసి తారుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. సురాయిపల్లి-ఊరగుంట రోడ్డు మధ్య వంతెన నిర్మించి బీటీగా మార్చాలని, బండివాడ-తిమ్మారెడ్డిపల్లి మధ్య తారు వేస్తే దూరం తగ్గుతుందన్నారు. దౌల్తాబాద్ నుంచి కొడీడ్ వరకు లింగయ్యబావి నుంచి ఉన్న రోడ్డును తారుగా వేస్తే.. దూరం తగ్గనుంది.



ఈర్లపల్లి-గోకఫసల్‌వాద్ మధ్య మట్టిరోడ్డు

1 నుంచి మండల స్థాయి క్రికెట్ టోర్నీ

యాలాల: జూన్ 1వ తేదీ నుంచి పట్నం రినీష్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ యువ నాయకుడు సిద్రాల శ్యాం ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టోర్నీలో విజేత జట్టుకు రూ.50వేల నగదుతో పాటు జ్ఞాపిక, రన్నరప్ జట్టుకు రూ.25వేల నగదు, జ్ఞాపిక అందజేస్తామన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో మండలంలోని అన్ని గ్రామాల నుంచి జట్లు పాల్గొనాలని సూచించారు. క్రీడలు విశ్వనాథ్‌పూర్ రాఘవపూర్ మైదానంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9959513055, 8247695642, 9963221850, 7093486423 నంబర్లను సంప్రదించాలన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తీరని కష్టాలు



జక్కేపల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రమేష్ మహరాజ్

- ధాన్యం తూకం, తరలింపులో అధికారుల నిర్లక్ష్యం
- పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్

యాలాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తిప్పలు తప్పడం లేదని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ మండిపడ్డారు. సోమవారం బెన్నూరు, జక్కేపల్లి, యాలాల, దేవనూరు, విశ్వనాథ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడగా.. కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు లారీలు లేకపోవడంతో కేంద్రాల వద్దే ఎదురుచూపులు తప్పడం లేదని పలువురు వాపోయారు. దీంతో రమేష్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం త్వరగా తూకం వేసి, మిల్లులకు తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడలా.. పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమప్ప, నాయకులు జనార్దన్‌రెడ్డి, నర్సిరెడ్డి, అమృతప్ప, నాగప్ప, సత్యనారాయణరెడ్డి, బస్వరాజ్, ఖాసీం ఉన్నారు.

ఓటర్ల తప్పొప్పులు సరిచేయండి

- రెండు కార్డులు ఉంటే ఒకటి తొలగించాలి
- ఆధార్ అనుసంధానం తప్పనిసరి
- అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్లు

పరిగి: ఓటర్ కార్డులో తప్పొప్పులు ఉంటే సరిచేసుకోవాలని తహసీల్దార్ రాంబాబు సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలో నియోజకవర్గంలోని 305 బీఎల్వోలు, పలు రాజకీయ పార్టీల నాయకులతో ఓటు నమోదు, సవరణపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. తప్పనిసరిగా ఓటరు.. ఆధార్ కార్డును ఓటరు కార్డుకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. డబుల్ కార్డులు ఉంటే వాటిని గుర్తించి ఒక దాన్ని తొలగించుకోవాలని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలించాలని సూచించారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోని వారికి అవగాహన కల్పించాల్సిన్నారు.



పరిగి: ఓటరు సవరణపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

బూత్‌లెవల్ అధికారులదే బాధ్యత

మర్పల్లి: ఓటర్ లిస్టులో తప్పొప్పులు సరిదిద్దే బాధ్యత బూత్‌లెవల్ (బీఎల్ఓలు) అధికారులదే అని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులతో ఓటర్ లిస్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికీ ఫామ్ 6 ద్వారా ఓటు హక్కుపై అవగాహన కల్పించాలన్నారు. పేర్లు తప్పుగా ఉంటే ఫారం నంబర్ 7లో వివరాలు సేకరించి సరిచేయాలన్నారు. ఓటర్ లిస్టులో పేర్లు ఉండి ఎవరైనా చనిపోతే ఆ కుటుంబ యజమాని నుంచి వివరాలు సేకరించి, అందుకు సంబంధించి మరణ ధ్రువీకరణ పత్రాలు లేదా ఆ కుటుంబ యజమాని అభిప్రాయం తీసుకొని చనిపోయిన వ్యక్తి పేరు తొలిగించేందుకు పేరు చుట్టూ రెడ్‌పెన్‌తో రౌండప్ చేయాలని చెప్పారు. ఆర్ఐ మాధవ రెడ్డి, సీనియర్ సహాయకులు గోపాల్ బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి రాజీనామా

ఎమ్మెల్యే సోదరుడు నర్సిరెడ్డికి ఛాన్స్

బషీరాబాద్: బీఆర్ఎస్ పార్టీ బషీరాబాద్ మండల అధ్యక్ష పదవికి రామునాయక్ సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి అందజేశారు. బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రామునాయక్ భార్య శాంతిబాయిని నామినెట్ చేశారు. అయితే ఒకే ఇంట్లో రెండు పదవులు ఉండరాదని తన పదవికి రాజీనామా చేసినట్లు రామునామక్ తెలిపారు.



రామునాయక్

ఎమ్మెల్యే సోదరుడికి బాధ్యతలు!

పార్టీ నూతన మండల అధ్యక్ష్య పదవిని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తన సోదరుడు పంజుగుల నర్సిరెడ్డి(రాజు)కి కట్టబెట్టారు. సొంత మండలం బషీరాబాద్‌లో పార్టీ నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఎమ్మెల్యే వర్గం కూడా కొంత బలహీనంగా ఉండడంతో నర్సిరెడ్డికి బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

కార్యకర్తలను కాపాడుకుంటాం

వికారాబాద్ అర్బన్: పార్టీ కార్యకర్తలు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా కాపాడుకుంటామని, ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ యువనాయకుడు సుభాన్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సోమవారం ఎంపీ తన సన్నిహితులను ఆసుపత్రికి పంపి సుభాన్ రెడ్డి యోగక్షేమాలు ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. రూ.8లక్షలు ఆసుపత్రి ఖర్చులకు ఎంపీ చెల్లించారు.

పరిమళించిన మానవత్వం



చెరువులో స్నానం చేయిస్తున్న వెంకటయ్య

బొంరాస్‌పేట: మానవత్వానికి ప్రాంతాలు, పరిచయాలు అవసరం లేదు. బీహార్ రాష్ట్రానికి చెందిన దివ్యాంగుడైన ఓ వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి కొంతకాలంగా తిరుగుతున్నాడు. మండల పరిధిలోని తుంకిమెట్ల జాతీయరహదారిపై.. బీఆర్ఎస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటయ్య బాటసారిని పరిశీలించాడు. చేరదీసి క్షవరం చేయించాడు. బొంరాస్‌పేట చెరువుకు తీసుకెళ్లి స్నానం చేయించి, కొత్తబట్టలు తొడిగించాడు. దీంతో వెంకటయ్యను పలువురు అభినందించారు.

గురుకులాలకు 12మంది విద్యార్థుల ఎంపిక

కొడంగల్ రూరల్: 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో చేరేందుకు గురుకులాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 12మంది విద్యార్థులు ఎంపికయినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. 18మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా.. అంజలి, సతీష్, గౌతమ్‌సింగ్, శ్రీకాంత్, మీనాక్షి, పి.వైష్ణవి, లావణ్య, శివలీల, ప్రవంతి, డి.అజయ్, కె.అజయ్, పి.రాకేష్‌లు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం విష్ణు, ఉపాధ్యాయులు వీరేశం, వెంకటయ్య విద్యార్థులను అభినందించారు.

వేసవి పఠనా శిబిరంలో చిత్రలేఖనం



చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్: అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న వేసవి పఠనా శిబిరంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. డ్రాయింగ్ మాస్టర్ సంజీవ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బొమ్మలు గీసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వీరేశం, వెంకటయ్య మాట్లాడుతూ.. శిబిరంలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొంటున్నారని, వారికి పాఠ్యాంశాలపై అవగాహన కలిగేందుకు సరళమైన పద్ధతిలో బోధిస్తూ, కథలు, చిత్రలేఖనం తదితరవాటిపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

'సీఈఐఆర్'తో ఫోన్ రికవరీ

కొడంగల్ రూరల్: స్థానిక బస్టాండులో ఈ నెల 28న ఓ వ్యక్తి ఫోన్ పోగొట్టుకోగా.. సోమవారం ఉదయం సీఈఐఆర్ యాప్ ద్వారా పోలీసులు ఫోన్ ఆచూకీ కనుగొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి గ్రామానికి చెందిన మడుపతి నవీన్ ఆదివారం కొడంగల్‌లో తన ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీఈఐఆర్‌తో.. ఫోన్ బస్టాండు ప్రాంతంలో పడి ఉందని తెలుసుకొని, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితుడు నవీన్‌కు ఏఎస్ఐ బాలకిషన్ ఫోన్ అందజేశారు.



నవీన్‌కు మొబైల్ అందజేస్తున్న ఏఎస్ఐ బాలకిషన్

నిందితున్ని కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న నేతలు

పెద్దేముల్: ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యను చంపిన హంతకున్ని శిక్షించాలని కుల అసమానత నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ వెంకటయ్య, కోకన్వీనర్ కిష్టప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, గూడూర్‌లో 2019లో మాచర్ల రమేష్.. సుశ్రతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారి ప్రేమకు గుర్తుగా ఓ బాలుడు ఉన్నాడు. ప్రేమకు, పెళ్లికి అడ్డురాని కులం.. వారసుడు పుట్టిన వెంటనే తక్కువ కులం దానివంటూ భార్యను, కొడుకును చంపేశాడు. దీంతో సుశ్రత తల్లిదండ్రులు న్యాయం కోసం పోరాడుతున్నారని, ఆ నిందితున్ని కఠినంగా శిక్షించాలని కిష్టప్ప డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనీల్‌కుమార్, కృష్ణ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

పరిగి: కాలనీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్‌కు 3వ వార్డు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, సమస్య పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతే కాకుండా కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయలేదని, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఉన్న డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించాలని పేర్కొన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిరణ్, కాలనీ అధ్యక్షుడు కిషన్‌నాయక్, కాలనీ వాసులు శ్రీనివాస్‌రెడ్డి, భీమ్, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

తాండూరు టౌన్: మహేశ్ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆలియా మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీబాలాజీ మందిరంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు. పలువురు రాజస్థానీ మహిళా మండలి సభ్యులు ఉత్సాహంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రక్తదానానికి మించింది లేదని, ప్రాణాపాయం నుంచి బయట పడేసేందుకు రక్తం ఆవశ్యకత ఎంతైనా ఉంటుందన్నారు. ముఖ్యంగా యువత రక్తదానం చేస్తూ ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యువమంచ్ అధ్యక్ష, కార్యదర్శులు బ్రిజ్ మోహన్ బూబ్, కిషన్ గోపాల్ రాఠి, శిబిర ఇన్‌చార్జి ఆశిష్ సార్డా, మాజీ అధ్యక్షుడు రాజ్ గోపాల్ సార్డా, ఓం ప్రకాష్ సోమాని, యువమంచ్, రాజస్థానీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రాజస్థానీ మహిళా మండలి సభ్యురాలు

క్రీడల్లో గెలుపోటములు సమానం

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మోకిల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ (వాలీబాల్-2023)లో భాగంగా సోమవారం ఆయన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శ్రీ కృష్ణ ప్రియతో కలిసి 100మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూల్యా నాయక్, చందర్ నాయక్, శంకర్ నాయక్‌లు వారి తల్లిదండ్రులైన లక్ష్మీ,లక్ష్మణ నాయక్‌ల జ్ఞాపకార్థం దుస్తులు అందించారని చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోకిల సర్పంచ్ సుమిత్ర, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజునాయక్, సామాజిక కార్యకర్త వాణి, ఉపాధ్యాయుడు ఆశీర్వాదం పాల్గొన్నారు.